VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 250

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 18 ఫిబ్రవరి 2026



# అమ్మాజీ జన్మదిన సందర్భంగా చిన్నారులకు పలకలు పంపిణి



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** శాసన సభ్యులు శ్రీరాం రాజాగోపాల్ (తాతయ్య) సతీమణి అమ్మాజీ (శ్రీదేవి ) పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పట్టణం లోని 14వార్డ్ లో అంగన్వాడి కేంద్రంలో పిల్లలు కు పలకలు, బిస్కెట్ ప్యాకెట్లు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఐ వి ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరపర్తి సోమేశ్వరరావు, ఐ వి ఎఫ్ రాష్ట్రఆధ్యాత్మిక కమిటీ వైస్ ప్రెసిడెంట్ పేరూరి వెంకట లక్ష్మి నరసింహారావు చేతుల మీదగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఐ వి ఎఫ్ జిల్లా నేతలు స్వామికృష్ణ, రాయపూడి రమేష్, మహిళా విభాగం నేతలు వాసా నాగమణి, రాయపూడి నాగ లక్ష్మి, వుటుకూరి అలేఖ్య ,అంగన్వాడి కేంద్రం టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మృతిని కుటుంబానికి ఫ్రెండ్స్ చేయూత



**బాపట్ల (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** బాపట్ల పట్టణం భీమవారి పాలెం కు చెందిన కారుమూరి సతీష్ విద్యుత్ షాక్ తో చనిపోవడంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మృతిని కర్మకాండలకు ఖర్చులలో భాగంగా ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ సభ్యులు భీమా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎలక్ట్రిషన్ గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కారుమూరి సతీష్ విద్యుత్ షాక్ తో చనిపోవడం బాధాకరమన్నారు. కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోతే ఆ కుటుంబం ఎన్నో విధాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని,పేదరికంతో ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేయాలని పలువురు కొరగా ఆర్గనైజేషన్ సభ్యుల సహాయ సహకారాల తో ఆర్గనైజేషన్ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి ఆదేశాలతో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశామన్నారు.ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇబ్బందులలో ఉన్న పేదలను ఆదుకోవడానికి ఎల్లప్పుడూ ముందుకు వస్తూ సభ్యుల సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రానున్న రోజుల్లో పేదలకు ఆర్గనైజేషన్ ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బండ్రెడ్డి అంకమ్మరావు, కొత్త మల్లికార్జునరావు, అక్కి శ్రీను, కోడి రెక్క రవి, బొగ్గవరపు శివ, మచ్చ కృష్ణారెడ్డి, చామర్తి సుబ్బారావు, తన్నీరు గోపి, నరాలశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

# హనుమాన్ విగ్రహం మీద వానరం



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు మండలం ఓగూరు గ్రామంలో అమావాస్య మంగళవారం రోజున అద్భుత సన్నివేశం చోటుచేసుకుంది. హనుమాన్ విగ్రహం మీద వానరం కూర్చుని ఆంజనేయ భక్తులకు, ప్రజలకు కనువిందు చేసింది. హనుమాన్ విగ్రహం మీద వానరం కూర్చుని ఉండటంతో ఆ సన్నివేశాన్ని చూసిన హనుమాన్ భక్తులు ఒకింత భక్తి పర్వశానికి లోనయ్యారు.అది మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన రోజు కావడంతో స్వామి వారి భక్తులు ఎంతో సంతోషం చెందారు.



**టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలలో భాగంగా బాల్ బ్యాట్మెంటన్ విన్నర్ లు గా మల్లికార్జున జట్టు, రన్నర్స్ గా చీర్ల కిరణ్ జట్టు.**

–తిరుమల,కలంకౌంటర్ :

# విశాఖలో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలికిన గవర్నర్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- విశాఖపట్నం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026లో ముఖ్య అతిథిగా హాజరు
- నగరంలో కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు
- మిలన్ పరేడ్‌తో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న రాష్ట్రపతి



**విశాఖపట్నం,కలంకౌంటర్ :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేటి సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. నగరంలోని ఐఎన్ఎస్ డేగా నౌకాదళ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆమెకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సాదరంగా స్వాగతం పలికారు. ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాస్, ఉన్నతాధికారులు కూడా రాష్ట్రపతిని ఆహ్వానించిన వారిలో ఉన్నారు. మంగళవారం (ఫిబ్రవరి 18) విశాఖ తీరంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026'కు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గా ఆమె ఈ సమీక్షను పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో భారత నౌకాదళంతో పాటు పలు విదేశీ యుద్ధనౌకలు కూడా పాల్గొంటాయి. ఈ పర్యటనలో భాగంగా, ఫిబ్రవరి 19న జరిగే 'మిలన్ అంతర్జాతీయ సిటీ పరేడ్', 20న నిర్వహించే 'కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాల్లో కూడా రాష్ట్రపతి పాల్గొంటారు. ఆమె పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో పోలీసులు, నౌకాదళ అధికారులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్, భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడంతో పాటు, మిత్రదేశాలతో సంబంధాలను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

# గత ప్రభుత్వం తెచ్చిన ఆ జీవో పిల్లలను స్కూళ్లకు దూరం చేసింది: నారా లోకేశ్



**అమరావతి,కలంకౌంటర్ :** గత ప్రభుత్వం 2019-24 సమయంలో జీవో 117 తీసుకురావడంతో పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని, ఈ క్రమంలో ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజాప్రభుత్వం వచ్చాక ఆ జీవోను రద్దు చేశామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ, గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అంతేకాకుండా పాఠశాల విద్యావ్యవస్థలో వన్ క్లాస్ - వన్ టీచర్ విధానం చాలా కీలకమైందని, గతంలో 3 శాతం పాఠశాలల్లో మాత్రమే వన్ క్లాస్ - వన్ టీచర్ ఉంటే, ఇప్పుడు 33 శాతానికి పెంచామని అన్నారు. దీనిద్వారా పిల్లలకు మెరుగైన విద్య అందడంతో పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రధానంగా 5 అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని అన్నారు. ప్రధానంగా లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింట్, బెంచీలు, టాయ్ లెట్స్, తాగునీరు అందించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల రేటింగ్ ఇచ్చామని, ఏపీలో 5 స్టార్ రేటింగ్ ఉన్నవి లేవని వెల్లడించారు. 40 శాతం 1, 2లో స్టార్‌లో ఉన్నాయని, అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 3, 4 స్టార్ రేటింగ్ కు తేవాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. పెండింగ్ వర్క్స్ పూర్తిచేయాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. ఎక్కడ తరగతి గదుల అవసరం ఉందో అక్కడ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని నిర్ణయించామని అన్నారు. ఎస్ఎంసీ ఎకౌంట్ లో రూ.200 కోట్ల నిధులు ఉన్నాయని, బడ్జెట్ లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించారని అన్నారు. ఈ రెండు కలిపి వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక మౌలిక సదుపాయాలకు రూ.వెయ్యి కోట్లు ఖర్చుచేసే అవకాశం ఉందని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒక పద్ధతి ప్రకారం 5 స్టార్ రేటింగ్ తెచ్చే బాధ్యత ప్రజాప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. 2014-19 నడుమ చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, గత ప్రభుత్వం పాఠశాలల విషయంలో అస్తవ్యస్త విధానాలు అవలంభించిందని అన్నారు. నాడు- నేడు పేరుతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. వాటి కారణంగా నేటికి కూడా అనేక చోట్ల అసంపూర్తి నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టి, పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపట్టినట్లు తెలిపారు. మనబడి - మన భవిష్యత్ పేరిట పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతూ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతోందని అన్నారు.

# సొంత జిల్లా లో కడప హజ్ హౌస్ కు ఒక్క పైసా ఇవ్వలేదు

- మైనారిటీల పట్ల జగన్ వ్యవహార శైలిపై అసెంబ్లీలో విరుచుకుపడ్డ మంత్రి ఫరూక్
- అమరావతిలో సకల సౌకర్యాలతో హజ్ హౌస్, ఇస్లామిక్ సెంటర్ ఏర్పాటు
- విజయవాడ నుంచి హజ్ కు వెళ్లే వారందరికీ రూ. లక్ష ఆర్థిక సాయం - మంత్రి ఫరూక్

**అమరావతి,కలంకౌంటర్ :** మైనారిటీలంటే జగన్ కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విరుచుకుపడ్డారు. సొంత జిల్లా కడపలో హజ్ హౌస్ నిర్మాణానికి టిడిపి ప్రభుత్వ హయాంలో రూ. 25 కోట్లు మంజూరు చేసి,రూ.13 కోట్లతో భవన నిర్మాణం, సౌకర్యాలు ఏర్పాటు చేస్తే.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ పెండింగ్ పనుల పూర్తికి ఒక పైసా కూడా విదల్చలేదని మంత్రి ఎద్దేవా చేశారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో హజ్ హౌస్ నిర్మాణం, హజ్ యాత్రికులకు ఏర్పాట్లపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అడిగిన ప్రశ్నకు మంత్రి ఫరూక్ సమాధానం ఇచ్చారు.

**హైదరాబాద్ హజ్ హౌస్ నిర్మాణం ఇతర రాష్ట్రాలకు ఆదర్శం..** ఉమ్మడి ఏపీలో హైదరాబాద్ నడిబొడ్డున ప్రత్యేకంగా జీవో ఇచ్చి, అసెంబ్లీలో పాస్ చేసి పదకొండు అంతస్తులతో ముంబైలో ఉన్న సెంట్రల్ హజ్ హౌస్ కు ధీటుగా చంద్రబాబు నేతృత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా హజ్ హౌస్ నిర్మించడం, సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పట్లో హైదరాబాదులో ఎంబార్కేషన్ సెంటర్ ఉండేది కాదని, అప్పటి ప్రధాని వాజ్ పేయితో మాట్లాడి,ప్రత్యేక అపాయింట్మెంట్ ఇప్పించి, జస్వంత్ సింగ్ గారిని పిలిపించి కేవలం పది నిమిషాల వ్యవధిలో ఎంబార్కేషన్ సెంటర్ మంజూరు చేయించిన చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధి, మైనారిటీ పట్ల ఉన్న నిబద్ధత ను మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. నిష్ణాతులైన ఆర్కిటెక్ లతో ప్లాన్ రూపొందించి నిర్మించిన హైదరాబాద్ హజ్ హౌస్ ను ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాల్లో హజ్ హౌస్ ల నిర్మాణాలు ప్రారంభించారన్నారు.



**జగన్ వ్యవహార శైలిపై ధ్వజమెత్తిన మంత్రి..** రాష్ట్రం విడిపోయిన సందర్భంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం హజ్ హౌస్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ఫరూక్ అన్నారు.అందుకు అనుగుణంగానే కడప జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు జిల్లా కేంద్రమైన కడపలో హజ్ హౌస్ నిర్మాణానికి చంద్రబాబు రూ. 25 కోట్లు మంజూరు చేశారన్నారు.రూ.13 కోట్లు ఖర్చు చేసి భవన నిర్మాణం, ఇతర పనులు చేసినప్పటికీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ తన సొంత జిల్లాలో హజ్ హౌస్ పెండింగ్ పనుల పూర్తికి ఒక్క రూపాయి కూడా విదల్చలేదని మంత్రి ఎద్దేవా చేశారు. జగన్ ఆ జిల్లా వాసి కాదా..? మైనారిటీలు అంటే ప్రేమ ఉండాలి కదా..? పులివెందులలో కూడా ముస్లిం మైనారిటీలు చాలామంది ఉన్నారు..! కదా..కానీ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పని కూడా చేయలేదని మంత్రి ఫరూక్ ఘాటుగా స్పష్టం చేశారు. హజ్ భవనంలో కరోనా పేషెంట్లను తీసుకొచ్చి అందులో పెట్టారే తప్ప ఏ మాత్రం అభివృద్ధి చెయ్యలేదని, దీన్నిబట్టి మైనారిటీల పట్ల జగన్ వైఖరి, ఎంత ప్రేమ ఉందో స్పష్టం అవుతున్నదని మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కడప హజ్ హౌస్ ను పూర్తి చేసే బాధ్యత తిరిగి మనమీదే పడిందని, చంద్రబాబు హామీ ఇచ్చారని మంత్రి పేర్కొన్నారు.

**అమరావతిలో హజ్ హౌస్, ఇస్లామిక్ సెంటర్..** అమరావతిలో హజ్ హౌస్ నిర్మాణం, ఇస్లామిక్ సెంటర్ ఏర్పాటుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుందని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు.సి ఆర్ డి ఏ పరిధిలో 10 ఎకరాలు కేటాయించాలని మంత్రి నారాయణ ని కోరడం జరిగిందన్నారు. మన రాష్ట్రం– మన ఏంబార్కేషన్ సెంటర్ నుంచే హజ్ కు యాత్రికులు వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ల నుంచి కాకుండా విజయవాడ గన్నవరం ఎయిర్పోర్ట్ నుండి హజ్ కు వెళ్లే ప్రతి ఒక్కరికి రూ. లక్ష రాయితీ ఆర్థిక సహకారం ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. 2025 లో 72 మంది యాత్రికులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. ఈసారి సుమారు 540 మంది విజయవాడ కేంద్రం నుండి బయలుదేరే అవకాశముందని తెలిపారు. కడప హజ్ హౌస్ భవనం లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుని భవనాన్ని వినియోగంలోకి తెస్తామన్నారు. మైనారిటీ ల సంక్షేమానికి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనదారులపై కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

**విజయనగరం,కలంకౌంటర్ :** డ్రైవర్లు కూడా తమ ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఓవర్ లోడుతో వాహనాలు నడపకూడదని, ఒకవేళ యజమాని ఒత్తిడి తెస్తే సమీప పోలీస్ స్టేషన్ లేదా ట్రాఫిక్ అధికారులకు సమాచారం ఇవ్వాలని లేని పక్షంలో డ్రైవర్ లైసెన్స్ సస్పెండ్ లేదా రద్దు జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో రోడ్డు భద్రత మరియు ప్రజల భద్రతను కాపాడుటలో భాగంగా ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే విధంగా లారీలు, ట్రాక్టర్లు, ట్రక్కులు, ఆటోలు వంటి వాహనాలు, గడ్డి, చెరుకు, గ్రావెల్, సిమెంట్ , ఇతర సరకు రవాణా లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు చేపడతామని, కేసులు నమోదుచేసి వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ -- ప్రజల భద్రత దృష్ట్యా రహదారి భద్రతా నియమాలను కఠినంగా అమలు చేస్తామని, ఇటీవల జిల్లాలో వాణిజ్య వాహనాలు, ముఖ్యంగా గడ్డి, చెరుకు, ఊక, ఇసుక, గ్రావెల్, సిమెంట్ మరియు ఇతర సరకు రవాణా వాహనాలు నిబంధనలకు మించి సరుకు మోసుకుంటూ (ఓవర్ లోడింగ్) రోడ్లపై ప్రయాణిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. వీటి వలన ప్రజల ప్రాణాలకు, రహదారుల మౌలిక వసతులకు మరియు ట్రాఫిక్ క్రమశిక్షణకు తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తోందన్నారు. ఈ




నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ తరఫున, వాహనాల ఓవర్ లోడింగ్‌ను పూర్తిగా నియంత్రించేందుకు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. వాహనం పరిమితికి మించి లోడుతో ప్రయాణిస్తున్నప్పుడు వెనుక వచ్చే వాహనాలు కనపడవని, వాహనం యొక్క బ్రేకింగ్ సిస్టమ్, టైర్లు, యాక్సిల్ ,సస్పెన్షన్ వ్యవస్థలపై అధిక ఒత్తిడి వలన బ్రేకులు సరిగ్గా పనిచేయకపోవడం, టైర్లు పేలిపోవడం, వాహనం నియంత్రణ కోల్పోయి రోడ్డు ప్రమాదాలకు కారణం అయి ఇతర వాహనదారులు , పాదచారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది జిల్లా ఎస్పీ తెలిపారు. అదేవిధంగా రహదారులు దెబ్బతిని గుంతలు ఏర్పడి మరిన్ని ప్రమాదాలకు కూడా కారనమవుతాయని తెలిపారు. ప్రత్యేకించి హైవేలపై అధిక వేగంతో ప్రయాణించే ఓవర్ లోడ్ వాహనాలు అత్యంత ప్రమాదకరంగా మారుతున్నాయని, చిన్న తప్పిదం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని, ఇటీవల దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న అనేక రోడ్డు ప్రమాదాల్లో ఓవర్ లోడింగ్ కూడా ఒక ప్రధాన కారణం అని తెలిపారు. వాణిజ్య వాహన యజమానులు లాభాపేక్షతో అధిక లోడ్ మోపించడం ద్వారా తాత్కాలికంగా లాభం పొందుతుతున్నారు గాని, ఏదైనా ప్రమాదం జరిగితే డ్రైవర్ల ప్రాణనష్టం, వాహనాల నష్టం, చట్టపరమైన ఇబ్బందులు, బీమా క్లెయిమ్ తిరస్కరణ వంటి వాటి గురించి ఒకసారి ఆలోచించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసు వారికి సహకరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని, ఓవర్ లోడ్ వాహనాలు మీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లయితే స్థానిక పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేసారు. జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజల సేవలోనే ఉంటుందని, రోడ్డు ప్రమాదాలు లేని సురక్షిత సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు.

# క్రీడలు మన జీవితంలో చాలా ముఖ్యమైనవి - అడిషనల్ ఎస్పీ సత్యానారాయణ









**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జిల్లా స్పోర్ట్స్ అథారిటీ జిల్లా అధికారి, కె. ఝాన్సీ లక్ష్మి ఆధ్వర్యంలో 45వ డివిజన్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు మంగళవారం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో చాలా ముఖ్యమైనవి అని, మన ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా క్రమశిక్షణ మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి అన్నారు. చెస్ ఒక మేదస్సు ఆధారిత ఆట అన్నారు. ఇది మన ఆలోచన శక్తిని, సహనాన్ని మరియు నిర్ణయ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తుంది అన్నారు. చెస్ ద్వారా మనం ముందు చూపుతో ఆలోచించడం నేర్చుకుంటాం అన్నారు. చెస్ పోటీలలో ప్రముఖ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్ ఆనంద్ ప్రపంచ ఖ్యాతి పొందారు అన్నారు. అలాంటివారిని స్ఫూర్తిగా తీసుకుని ఆటలో ముందుకు వెళ్లి పోటీలో విజయం సాధించాలి అన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో అవసరం, అందరూ రోజు కొంత సమయం క్రీడలకు కేటాయించాలి అన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్ హాజరై మాట్లాడుతూ. మంత్రి కొల్లు రవీంద్ర క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని, యువత కోసం యువతరంగాలు, బీచ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు పెట్టి మంత్రి కొల్లు రవీంద్ర క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించారని, అలాగే మచిలీపట్నంలో క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కలుగచేయడానికి మంత్రి కొల్లు రవీంద్ర విశేష కృషి చేస్తున్నారు అన్నారు. జిల్లా క్రీడా అధికారి కె. ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ. రాష్ట్రస్థాయి చెస్ పోటీల ఎంపికలో భాగంగా జిల్లా స్థాయిలో చెస్ పోటీలలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 155 మంది యువత చెస్ పోటీలలో పాల్గొన్నారు అని తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన చెస్ పోటీలలో 16 మంది యువత రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు విజేతలుగా ఎంపికయ్యారని, ఈ రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో ఎంపికైన వారు ఈనెల 21, 22 తేదీలలో తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు వారిని పంపించడం జరుగుతుంది అన్నారు. ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది అని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి, కె. ఝాన్సీ లక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్, హసీం బేగ్, రాష్ట్ర శిష్ట కరణం సాధికార సమితి కన్వీనర్, అక్కుమం తి రాజా, తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నగర కార్పొరేషన్ అధ్యక్షుడు, లోగి శెట్టి వెంకటస్వామి, జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్, అజీమ్, ప్రముఖ న్యాయవాది, అమర్, చెస్ ఆర్గనైజేషన్ ఆర్బిట్రేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా అమరజీవి విగ్రహనిర్మాణ పనులు

## –ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ పర్యవేక్షణ





ఫైల్ ఫోటోలు



**అమరావతి,కలంకౌంటర్ :** తెలుగు జాతి కోసం తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించి మనకు రాష్ట్రాన్ని సాధించిన మహనీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణ పనులు అమరావతి లో శరవేగంగా సాగుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ,శ్రీ పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలోజరుగుతున్న ఈ పనులు దూండీ రాకేష్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ అమరజీవి విగ్రహ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దూండీ రాకేష్ అన్ని వర్గాలను కలుస్తూ విజ్ఞప్తి చేస్తున్నారు. అన్ని జిల్లాల నుంచి విశేష స్పందన లభిస్తోంది.చరిత్రలో నిలిచిపోయే మహా యజ్ఞంలో మేము సైతం అంటూ పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. అమరావతి లో ప్రభుత్వం కేటాయించిన 6.8 ఎకరాల స్థలంలో ఆయన చేసిన 58 రోజుల నిరాహారదీక్ష కు గుర్తుగా 58 అడుగుల పొట్టి శ్రీ రాములు విగ్రహం ఏర్పాటు ను ట్రస్ట్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేస్తున్నారు.ఈ స్మృతివనం లో మెమోరియల్ బిల్డింగ్, బిల్డింగ్ మీద 58 అడుగుల విగ్రహం, మినీ థియేటర్, మ్యూజియం, ఆడిటోరియం ఏర్పాటు చేస్తున్నారు.కేవలం నిర్మాణాలు మాత్రమే కాదు ప్రతి సంవత్సరం ఆయన జయంతి కి 1000 మందికి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. . ఈ నిర్మాణంలో మొదటి ఫేజ్ లో భాగంగా 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ ఆయన 125 వ జయంతి ని పురస్కరించుకుని మార్చి16 న ఘనంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అమ-రజీవి విగ్రహ నిర్మాణం ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆర్యవైశ్యులుగా మనం ముందు డొనేట్ చేసి కుల మత ప్రాంతాలకు అతీతంగా అందరిని సమన్వయం చేసుకుంటూ విగ్రహ నిర్మాణాన్ని ముందుకు నడిపిద్దామని ఏపీ ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ విజ్ఞప్తి చేశారు. అంగుళానికి 5,116 విరాళం ఇచ్చి అమరజీవికి నివాళి అర్పించాలని ఏపీ ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ విజ్ఞప్తి చేశారు.

# అగ్ని ప్రమాద బాధిత కోర్టు ఉద్యోగి కి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ చేయుత...





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నియోజకవర్గం పోతేపల్లి గ్రామంలో జిల్లా కోర్టు ఉద్యోగి అర్జా లక్ష్మీ ఇల్లు ఆదివారం సాయంత్రం గ్యాస్ లీకేజ్ తో ఇల్లు మొత్తం కాలిపోయింది. సుమారు 7 లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది.అర్జా లక్ష్మీ తన భర్త సుబ్బారావు ముగ్గురు చిన్నపిల్లలతో కాపురం ఉంటుంది. గ్యాస్ లీకేజీతో ఇల్లు మొత్తం కాలిపోయి కట్టుబట్టలతో ప్రాణాలతో బయటపడ్డారు. మంగళవారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ బాధిత కుటుంబానికి నిత్యవసర వస్తువులు, బియ్యం బట్టలు, వంట సామాగ్రి, 5,000 రూపాయలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ గతంలో ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ పరంగా ఇచ్చే 5,000 రూపాయలు రద్దుచేసి కేవలం 25 కేజీలు బియ్యం ఇవ్వటం సమంజసం కాదని అన్నారు. నిజమైన అగ్ని బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా పక్కా ఇల్లు నిర్మించి లక్ష రూపాయలు బ్యాంకు రుణం మంజూరు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. బాధిత కుటుంబానికి మచిలీపట్నంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని బాలాజీ కోరారు. రాబోయే వేసవికాలం పురస్కరించుకొని నగర ప్రజలు విద్యుత్తు షార్ట్ సర్క్యూటివ్ గ్యాస్ లీకేజీ పట్ల అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించు కోవాలని బాలాజీ అన్నారు. మచిలీపట్నం చుట్టుపక్క ప్రాంతాలలో అగ్ని ప్రమాద బాధితులకు గత 15 సంవత్సరాలుగా అండగా ఉంటున్న లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సేవలు ఆదర్శప్రాయమని మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పోతేపల్లి జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ తోట రాజేష్, మాజీ గ్రామ సర్పంచ్ శ్రీపతి చంద్రం, తమన్నఆదిత్య పోతేపల్లి సచివాలయం ఉద్యోగి ప్రభు ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు

# రాళ్లపాడు సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
- అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారం చేస్తామన్న మంత్రి



**అమరావతి,కలంకౌంటర్ :** రాళ్లపాడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రిజర్వాయర్ గేట్లు, హెడ్ రెగ్యులేటర్ల ఆధునీకరణపై అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం గళం వినిపించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు కోసం చేసిన కృషిని గుర్తు చేస్తూనే... తక్షణం చేపట్టాల్సిన పనుల గురించి ఎమ్మెల్యే ప్రస్తావించారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగునీరు అందించే ప్రధాన వనరు రాళ్లపాడు రిజర్వాయర్ అని పేర్కొన్నారు. 1958 లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఎదుర్కొంటున్న సమ-స్యలను పరిష్కరించి, రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. రాళ్లపాడు ఎడమ కాలువ కింద 4,000 ఎకరాల ఆయకట్టు ఉండగా, ప్రస్తుతం కేవలం 1,500 ఎకరాలకు మాత్రమే నీరు అందుతోంది. కాలువను విస్తరించి, చివరన ఉన్న రైతులకు కూడా నీరు అందించాలి.1996 వరదల తర్వాత ప్రాజెక్టు మరమ్మతుల్లో భాగంగా గేట్లు ఏర్పాటు చేసినా, 'స్టాప్ లాక్ గేట్లు' లేకపోవడంతో నీటి విడుదలలో ఒక్కోసారి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెకానికల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రిపేర్లు చేయటం కష్టంగా ఉంటుంది. ప్రాజెక్టు భద్రతకు ముప్పు రాకముందే స్టాప్ లాక్ గేట్లను ఏర్పాటు చేయాలి.పురాతన పద్ధతిలో, రాతి కట్టడంతో ఉన్న హెడ్ రెగ్యులేటర్లను మార్చాల్సిన అవసరం ఉంది. ఆధునీకరణ లేకపోవడంతో గతంలో నీళ్లు ఇవ్వటానికి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చివరకు జనరేటర్ సహాయంతో నీళ్లు విడుదల చేశాం. ఆధునిక సాంకేతికతతో హెడ్ రెగ్యులేటర్లను ఆపరేట్ చేసేలా చర్యలు తీసుకోవాలి. వరదలు వచ్చినప్పుడు, వేసవి కాలాల్లో రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రశ్నకు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ రాళ్ళపాడు రిజర్వాయర్ పురాతనమైనది కాబట్టి... ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరిన విధంగా స్టాప్ లాక్ గేట్లు, హైడ్రాలిక్ గేట్లు, ఇతర మెకానికల్ మరమ్మతులను పరిశీలించి, ఆ పనులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేశారు.

# ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసిన ఎస్సై టి రామకృష్ణ



**తాళ్లపూడి,కలంకౌంటర్ :** తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం తాళ్లపూడి ప్రధాన రహదారిలో ద్విచక్ర వాహనదారుల రికార్డులను తనిఖీ చేసిన ఎస్సై. టి రామకృష్ణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే ప్రతి వాహనదారుడు తప్పని సరిగా లైసెన్స్, వాహనం యొక్క రికార్డ్ పొల్యూషన్ తదితర కాగితాలు కలిగి ఉండాలని అన్నారు. అంతే కాకుండా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనంపై త్రిబుల్ రైడ్ చేయరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలాన్నారు ప్రతిరోజు సాయంత్రం సమయంలో ప్రధాన మార్కెట్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. మంగళవారం పలు ద్విచక్ర వాహనదారులకు చలానాలు విధించడం జరిగిందని అన్నారు. ట్రాఫిక్ విధులలో ఎస్సై తో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు .

# అమరజీవి విగ్రహ నిర్మాణానికి సహకరిద్దాం

## –కోనా శ్రీనివాసరావు ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



**తాడేపల్లిగూడెం,కలంకౌంటర్ :** తెలుగు జాతి కోసం తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించి మనకు రాష్ట్రాన్ని సాధించిన మహనీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు అన్నారు. అంతటి గొప్ప త్యాగం చేసిన ఆ మహానుభావుడికి అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమరావతి లో ప్రభుత్వం కేటాయించిన 6.8 ఎకరాల స్థలంలో ఆయన చేసిన 58 రోజుల నిరాహారదీక్ష కు గుర్తుగా 58 అడుగుల పొట్టి శ్రీ రాములు విగ్రహం ఏర్పాటు ను ట్రస్ట్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేస్తున్నారనీ,..ఈ స్మృతివనం లో మెమోరియల్ బిల్డింగ్, బిల్డింగ్ మీద 58 అడుగుల విగ్రహం, మినీ థియేటర్, మ్యూజియం, ఆడిటోరియం ఏర్పాటు చేస్తున్నారనీ,.కేవలం నిర్మాణాలు మాత్రమే కాదు ప్రతి సంవత్సరం ఆయన జయంతి కి 1000 మందికి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని కోనా శ్రీనివాసరావు తెలిపారు. ట్రస్ట్ మెనేజింగ్ ట్రస్టీ దూండి రాకేష్ ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణంలో మొదటి ఫేజ్ లో భాగంగా 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ ఆయన 125 వ జయంతి ని పురస్కరించుకుని మార్చి16 న ఘనంగా జరగబోతుందన్నారు. మహత్కార్యంలో మనమందరం కలిసి సపోర్ట్ చెయ్యాలి. విగ్రహ నిర్మాణంలో 1 అంగుళం 5,116/- రూపాయలు.ఆర్యవైశ్యులుగా మనం ముందు డొనేట్ చేసి కుల మత ప్రాంతాలకు అతీతంగా అందరిని సమన్వయం చేసుకుంటూ విగ్రహ నిర్మాణాన్ని ముందుకు నడిపిద్దామని ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. 1 అంగుళానికి 5,116 విరాళం ఇచ్చి అమరజీవికి మీ నివాళి అర్పించాలని ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

# సేవకుల్ని సన్మానించిన ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు





**తాడేపల్లి గూడెం,కలంకౌంటర్ :** తాడేపల్లిగూడెం ఆర్యవైశ్య సంఘం ఫుడ్ కమిటీ సేవకులకు ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు,కోనా హనుమాన్ చిరు సత్కారము చేశారు. ఐ వి ఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం రోజు చేసిన సేవల్ని కోనా శ్రీనివాసరావు కొనియాడారు.అనంతరం ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు, సేవాదళ్ అధ్యక్షుడు కోనా హనుమాన్ బాబు లను సన్మానించారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com